ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 20.03.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వరుసగా నాలుగో సారి రాష్ట్ర బడ్జెట్ ను అసెంబ్లీలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. అంబేద్కర్, గాంధీ ఆశయాల అడుగు జాడలలోనే తమ పాలన కొనసాగుతోందని మంత్రి పేర్కొన్నారు.
2. తెలంగాణ తలసరి ఆదాయం 4 లక్షల 18 వేల 931 రూపాయలకు చేరి, 10.2 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని ఆర్థిక మంత్రి వెల్లడించారు.
3. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పిస్తూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పేరుతో కొత్త పథకాన్ని భట్టి విక్రమార్క ప్రకటించారు.
4. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ హైదరాబాద్ లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన చేపట్టింది.

-----------------------

**బడ్జెట్**

వరుసగా నాలుగో సారి రాష్ట్ర బడ్జెట్ ను అసెంబ్లీలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. అంబేద్కర్, గాంధీ ఆశయాల అడుగు జాడలలోనే తమ పాలన కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ రోజు అసెంబ్లీ 2026 - 2027 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశ పెడుతూ... తమ ప్రభుత్వ పాలనా లక్ష్యాన్ని తెలుపుతూ తాము పాలకులం కాదని, ప్రజల సేవకులమని భావిస్తూ సంక్షేమం, అభివృద్ధి కోసం బాధ్యతాయుతంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు.

**బైట్ భట్టి విక్రమార్క**

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను ఉప ముఖ్యమంత్రి వివరించారు. ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి 17 లక్షల 82 వేల

198 కోట్ల రూపాయలుగా నమోదైందని, గత ఏడాదితో పోలిస్తే ఇది 10.7 శాతం వృద్ధిరేటును సాధించిందని ఆయన తెలిపారు. ఇదే కాలంలో దేశ జిడిపి వృద్ధిరేటు 8 శాతం ఉండగా, తెలంగాణ అంతకంటే 2.7 శాతం అధిక వృద్ధిని కనబరిచిందని పేర్కొన్నారు. దేశ మొత్తం జిడిపిలో తెలంగాణ 5 శాతం వాటాను కలిగి ఉండటం విశేషమని, తద్వారా భారతదేశ ప్రగతిలో రాష్ట్రం ఒక బలమైన 'గ్రోత్ ఇంజిన్'గా నిలుస్తోందని భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు.

**బైట్ భట్టి - జీడీపీ**

రాష్ట్ర తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. తలసరి ఆదాయం 4లక్షల 18 వేల 931 రూపాయలకు చేరి, 10.2 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని ఆయన తెలిపారు. దేశ తలసరి ఆదాయం 2 లక్షల 19 వేల 575 రూపాయలగాను, వృద్ధి రేటు 6.9 శాతంగా ఉండగా, దేశ తలసరి ఆదాయం కంటే తెలంగాణ ఆదాయం 1.9 రెట్లు ఎక్కువగా ఉండటం రాష్ట్ర ఆర్థిక పురోగతికి నిదర్శనమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు అంతర్జాతీయ స్థాయిలో CURE, PURE, RARE అనే మూడు ప్రత్యేక ఆర్థిక మండలాలుగా గుర్తించినట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న CURE ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్, టెక్నాలజీ, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతామని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య కారక పరిశ్రమలను తరలిస్తూ పెట్రోల్ ఆటోలను విద్యుత్ వాహనాలుగా మారుస్తామని తెలిపారు. ORR, రీజినల్ రింగ్ రోడ్డు (RRR) మధ్య గల PURE ప్రాంతాన్ని ఉత్పాదక రంగం, MSME క్లస్టర్ల తయారీ కేంద్రంగా మారుస్తామన్నారు. ఇక RRR అవతల ఉన్న RARE ప్రాంతాన్ని ఆహార ప్రాసెసింగ్, విలువాధారిత వ్యవసాయం, ఎకో-టూరిజం అభివృద్ధికి కేటాయించినట్లు వివరించారు. ఈ వ్యూహాత్మక విభజన ద్వారా సేవ, ఉత్పాదక, వ్యవసాయ రంగాల్లో సమతుల్య అభివృద్ధి సాధించి తెలంగాణ ఆదాయాన్ని పెంచుతామని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ ఏడాది జూన్ 2వ తేదీ నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి శ్రీకారం చుడుతున్నట్లు ఆయన వెల్లడించారు. సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, ధనిక అనే తేడా చూడకుండా సుమారు 1

కోటి 15 లక్షల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల జీవిత బీమా వర్తింపజేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు.
తెలంగాణను దేశంలోనే ఆర్థిక శక్తిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో సుమారు 2 వేల మంది అంతర్జాతీయ ప్రతినిధులు పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు ఆర్థిక నిపుణులు పాల్గొన్నారని ఆయన అన్నారు. 100కు పైగా ఎంఓయులు కుదుర్చుకున్నామని వీటి ద్వారా 5 లక్షల 75 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టడానికి ప్రతిపాదనలు వచ్చాయని అన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసిన మొట్టమొదటి వాగ్దానం 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకమని భట్టి విక్రమార్క అన్నారు. ఈ పథకం ద్వారా ప్రతిరోజు సుమారు 34 లక్షల 37 వేల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని ఆయన వెల్లడించారు. ఇప్పటివరకు మహిళలు మొత్తం 269 కోట్ల 68 లక్షల సార్లు ఉచిత ప్రయాణాలు చేశారని, దీనివల్ల దాదాపు 9 వేల 222 కోట్ల రూపాయల మేర వారికి ఆర్థికంగా ఆదా అయ్యిందని భట్టి విక్రమార్క వివరించారు. ఈ పథకం ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచడమే కాకుండా, వారి కుటుంబ ఆర్థిక స్థితిగతులకు ఎంతో అండగా నిలుస్తోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.
రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా తమ ప్రభుత్వం పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించారు. 'రైతు భరోసా' ద్వారా ఏటా ఎకరానికి 12వేల రూపాయల పెట్టుబడి సాయం అందిస్తున్నామని, సన్నవడ్లకు క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం వల్ల రైతులకు ఎకరానికి ఏడాదికి 25 వేల రూపాయల అదనపు ఆదాయం లభిస్తోందని వివరించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, రైతు సంక్షేమం కోసం 23 వేల 179 కోట్ల రూపాయలు కేటాయించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.

**బైట్ – భట్టి – రైతు భరోసా**

విద్యుత్ శాఖకు బడ్జెట్‌లో 21 వేల 285 కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 23వేల 187 మెగావాట్ల సామర్థ్యం ఉందని, 2026

మార్చి 13న గరిష్టంగా 18వేల 228 మెగావాట్ల డిమాండ్‌ను విజయవంతంగా నెరవేర్చి సరికొత్త రికార్డు సృష్టించామని ఆయన వివరించారు.

2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ పద్దును సభలో ప్రవేశపెట్టడానికి ముందు ప్రజాభవన్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో బడ్జెట్ ప్రతులకు అర్చకులు పూజలు చేశారు. అనంతరం ఈ ఉదయం అసెంబ్లీ కమిటీ హాల్‌లో మంత్రి వర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో.. రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**డెస్క్**

-----------------------------

**బీఆర్ఎస్ నిరసన**

హైదరాబాద్ లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామా రావు, హరీష్ రావు నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమై తెలంగాణను ఆగం చేశారని ఆరోపిస్తూ "బాకీ కార్డుల"ను ప్రదర్శించారు. ముఖ్యంగా దివ్యాంగులకు రావాల్సిన 54 వేల రూపాయలు, నిరుద్యోగులకు ఇస్తామన్న రెండు లక్షల ఉద్యోగాలు, భృతి ఏమయ్యాయని వారు నిలదీశారు. ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చిన ఆర్థిక సాయం, వృద్ధులకు పెంచిన పెన్షన్ నగదు, పేదింటి ఆడబిడ్డలకు ఇస్తామన్న తులం బంగారం వంటి బాకీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

**డెస్క్**

----------------------

**హరీష్ రావు**

అసెంబ్లీలోని బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల

నిర్మాణంలో భారీ కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా టెండర్లు పూర్తయిన 76 పాఠశాలల్లో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న 26 నియోజకవర్గాలకు ఒక్కటి కూడా కేటాయించకుండా కక్షపూరితంగా వ్యవహరించారని విమర్శించారు. అయితే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు, కొందరు బీజేపీ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు మాత్రం స్కూళ్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ టెండర్లలో కాంట్రాక్టర్లు రింగ్‌గా ఏర్పడి, నిబంధనలకు లోబడి గరిష్టంగా 4.96% వరకు ఎక్సెస్ ధరలను కోట్ చేసి పక్కా ప్లాన్‌తో ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని వివరించారు. ప్రభుత్వ అంచనా వ్యయం కంటే సుమారు 494 కోట్ల రూపాయల అదనపు భారంతో టెండర్లు దక్కించుకున్నారని, ఈ వ్యవహారంలో అవినీతి చోటుచేసుకుందని హరీశ్ రావు ఆరోపించారు.

**డెస్క్**

------------------------------

**ఆది శ్రీనివాస్**

రంజాన్ మాసం త్యాగం, సహనం, సమానత్వానికి ప్రతీక అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో పరస్పర గౌరవం, సౌభ్రాతృత్వం పెంపొందించడానికి ఇటువంటి సామూహిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ, మైనారిటీల సంక్షేమానికి నిరంతరం కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు.

**పీటీసీ – రాజన్ని సిరిసిల్ల**

------------------------------

**కిషన్ రెడ్డి - తిరుమల**

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు టీటీడీ అధికారులు సాదర స్వాగతం

పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ దేశం మోదీ నాయకత్వంలో ఆధ్యాత్మికత, అభివృద్ధి, శాంతి మార్గంలో పయనిస్తోందని కొనియాడారు. ప్రపంచమంతా యుద్ధ మేఘాల మధ్య ఉన్నప్పటికీ, ప్రధాని నాయకత్వంలో భారతదేశం అత్యంత సురక్షితంగా ఉందని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

**డెస్క్**

--------------------------------

**మెట్రో అంతరాయం**

హైదరాబాద్‌లోని నాగోల్-రాయదుర్గం మార్గంలో సాంకేతిక లోపం తలెత్తడం వల్ల మెట్రో సేవలకు పాక్షికంగా అంతరాయం కలిగింది. రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులు సుమారు 20 నిమిషాల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెట్రో సిబ్బంది తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టడంతో సమస్య పరిష్కారమైంది. ప్రస్తుతం ఈ మార్గంలో మెట్రో సర్వీసులు యధావిధిగా కొనసాగుతున్నాయి.

**డెస్క్**

-------------------------

**మొయినాబాద్ కేసు**

మొయినాబాద్ ఫామ్‌హౌస్ కేసులో నిందితుల కస్టడీ పిటిషన్‌పై ఉప్పర్‌పల్లి కోర్టులో విచారణ ముగిసింది. ఈ కేసులో అరెస్టయిన పైలట్ రోహిత్ రెడ్డి, రితీష్ రెడ్డి, నమిత్ శర్మలను వారం రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరారు. ఫామ్‌హౌస్ ఉదంతానికి సంబంధించి మరిన్ని కీలక ఆధారాలు సేకరించాల్సి ఉందని, నిందితుల నుంచి సమాచారం రాబట్టడం అత్యవసరమని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇవాళ కోర్టులో ఉభయ పక్షాల మధ్య సుదీర్ఘ వాదనలు జరిగాయి. నిందితుల తరపు న్యాయవాదులు కస్టడీని వ్యతిరేకించగా,

కేసు తీవ్రత దృష్ట్యా విచారణ తప్పనిసరని ప్రభుత్వ న్యాయవాదులు వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తుది తీర్పును వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

**డెస్క్**

-------------------------

**గద్దర్ అవార్డ్స్**

నిన్న హైదరాబాద్ లోని హైటెక్స్ అంగరంగ వైభవంగా తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులు 2025 జరిగింది. తెలుగు సిని పరిశ్రమ దిగ్గజాల తో పాటు బాలీవుడ్ ప్రముఖులు కూడా పాల్గొన్నారు. గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ బిర్యానీతో పాటు తెలుగు సినిమాకు దేశంలో ప్రత్యేక గుర్తింపు ఉందని కొనియాడారు. గద్దర్ పేరిట అవార్డులు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, దక్షిణ కొరియా తరహాలో చిత్ర పరిశ్రమను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని హామీ ఇచ్చారు. చెన్నై నుండి హైదరాబాద్‌కు తరలిన తెలుగు సినిమా నేడు ప్రపంచ స్థాయికి ఎదిగిందని హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యంత సురక్షిత నగరంగా అభివర్ణించిన సీఎం, ఇండియన్ సినిమాకు ఇది కేంద్ర బిందువు కావాలని ఆకాంక్షించారు. పరిశ్రమకు ఎలాంటి కష్టం వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి పూర్తి భరోసా కల్పిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, సినీ నటులు కమల్‌హాసన్, చిరంజీవి, నాగార్జున, రామ్‌చరణ్, నాగచైతన్య, మాధురి దీక్షిత్,భూమిక, రష్మిక, జెనీలియా, నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వినీదత్, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎఫ్‌ఏ) ఛైర్మన్ దిల్ రాజు, ఎండీ సీహెచ్ ప్రియాంక, గద్దర్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**డెస్క్**

----------------------